సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా

ఆదివారం । 2 । ఫిబ్రవరి । 2025



బాలల కోసం బంగారు లోకం

కడప నగరంలోని సెయింట్ జోసెఫ్ స్కూల్ ప్రాంగణం శనివారం బాలల కోసం ఏర్పడిన బంగారు లోకాన్ని తలపించింది.

-IIలో



చెలరేగిన ఆంధ్రా బ్యాట్స్‌మన్

కల్నల్ సీకే నాయుడు అండర్-23 అంతర్ రాష్ట్రాల క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు బ్యాట్స్‌మన్ చెలరేగారు.

-IIలో

వాతావరణం


గరిష్ఠం/కనిష్ఠం
33.6/21.5

జిల్లాలో శనివారం 21.5 - 33.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

ఉక్కు ఊసు లేక.. బడ్జెట్ తుస్సు!





- కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావన లేని రీఆర్గనైజేషన్ బిల్లు అంశాలు
- వెనుకబడిన ప్రాంత ఉన్నతి కోసం ఉక్కు పరిశ్రమ ఊసే లేదు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న నిరుద్యోగ యువత

సాక్షి ప్రతినిధి కడప: కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు మరోసారి మొండిచేయే మిగిలింది. ఏపీ రీఆర్గనైజేషన్ బిల్లుపై కేంద్రానికి శ్రద్ధ లేదని మరోసారి రుజువైంది. బడ్జెట్‌లో వైఎస్సార్ జిల్లా ఉక్కుపరిశ్రమ ఊసే లేకుండా పోయింది. రాయలసీమ లాంటి వెనుకబడిన ప్రాంతంపై కేంద్రానికి చిత్తశుద్ధి లేదని స్పష్టమైంది. ఒక్క మాటలో చెప్పాలంటే ఆర్థిక మంత్రి నిర్మలమ్మ మరోసారి మొండి చేయి చూపింది.

- కేంద్రప్రభుత్వం చర్యలు నేరుగా లబ్ధిదారునికి ఊరట కల్పించే దిశగా ఉన్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన బడ్జెట్ ఈ విషయం స్పష్టం చేస్తోంది. రాష్ట్రాల ప్రయోజనాలతో నిమిత్తం లేకుండా అసంఘటిత కార్మికులు, ఉద్యోగులు, పేద, మధ్య తరగతి ప్రజానీకానికి లబ్ధి చేకూరేలా నిర్ణయం తీసుకున్నారు. అద్దె ఆదాయంపై వార్షిక టీడీఎస్ రూ.2.4లక్షల పరిమితిని రూ.6లక్షలకు పెంచారు. వేతనజీవులకు ఆదాయపు పన్ను పరిమితి రూ.12లక్షలకు పెంచారు. ఆపై ఆదాయం గడించేవారు మాత్రమే ఆదాయపు పన్ను చెల్లించాల్సి ఉంది. ఈపరిణామాన్ని ఉద్యోగ వర్గాలు స్వాగతిస్తున్నాయి.

ఊసే లేని రీ ఆర్గనైజేషన్ బిల్లు అంశాలు...

బడ్జెట్‌లో ఏపీ రీ ఆర్గనైజేషన్ బిల్లులోని అంశాలు కేంద్రానికి గుర్తుకు రాలేదని పలువురు వాపోతున్నారు. కడప గడపలో ఉక్కు పరిశ్రమ నెలకొల్పాలని కేంద్ర ప్రభుత్వం చట్టం చేసినా నిరుపయోగమే అయ్యింది. తాజా బడ్జెట్‌లో ఉక్కు పరిశ్రమ కోసం ఎలాంటి నిధులు కేటాయించలేదు. ఈ పరిణామం జిల్లా వాసులకు ఏమాత్రం రుచించడం లేదు. రాయలసీమ లాంటి వెనుకబడిన ప్రాంతాల ఉన్నతి కోసం ప్రత్యేక శ్రద్ధ చూపడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శించిందని పరిశీలకులు మండిపడుతున్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగింది. బడ్జెట్ ప్రసంగంలో ఏపీ ప్రస్తావనే లేదు. బీహార్‌కేమో పలు ప్రాజెక్టులు కేటాయించారు. ఎన్డీయే ప్రభుత్వం టీడీపీ మద్దతు మీద ఆధారపడి ఉన్నప్పటికీ ఏపీకి ప్రత్యేక ప్రాజెక్టులుగానీ, కేటాయింపులుగానీ లేకపోవడం విచారకరం. కేంద్రంలోని రాజకీయ అనివార్య పరిస్థితులను రాష్ట్రానికి అనుకూలంగా మార్చుకోవడంలో చంద్రబాబు ప్రభుత్వం తీవ్రంగా వైఫల్యం చెందింది.

-పి.రవీంద్రనాథ్ రెడ్డి,
వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

రాముని సేవలో హనుమ



హనుమంత వాహనంపై కడప రాయుడు

కడప కల్చరల్: తన ప్రభువు, లోక పాలకుడు శ్రీరామచంద్రుడు కార్యార్థమై తనను సేవకుడిగా ఎంచుకున్నందుకు హనుమ పులకించిపోయాడు. ఆ సేవ అదృష్టంగా భావించి శ్రీరాముడికి వాహనమై తరించాడు. కోదండపాణిగా రాముడు వనవిహారం చేసేందుకు సహకరించాడు. దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి ఉదయం కల్పవృక్ష వాహనంపై కొలువుదీరి మాడవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కల్పవృక్షం వాహనంపై స్వామి ఊరేగింపు ఏర్పాటు చేయడంతో తిలకించేందుకు భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. సాయంత్రం హనుమంత వాహనంపై కోదండ రాముడిగా కొలువుదీరాడు. వేద పండితులు స్వామి అమ్మవార్ల మూల విరాట్లకు విశేష అలంకారం చేశారు. అనంతరం ఆలయం వెలుపలగల అలంకారం మండపంలో స్వామిని వాహనంపై ఆశీనులను చేశారు. సూర్యతేజోమయుడైన శ్రీ రామచంద్రుడు ధగధగలాడే రంగురంగుల విద్యుద్దీపాల వెలుగులో మరింతగా మెరిసిపోతూ భక్తులను కరుణించాడు. పాతకడప, దేవునికడపలతోపాటు నగరానికి చెందిన భక్తులు స్వామి వెంట ఊరేగింపులో పాల్గొన్నారు.

విభజన హామీల ప్రస్తావనే లేదు



కేంద్రంలో, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం డబుల్ ఇంజన్ సర్కారుగా ముందుకు పోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పదేపదే చెబుతున్నప్పటికీ ఆచరణలో కనిపించడం లేదు. దీనికి ఈ కేంద్ర బడ్జెటే ఉదాహరణ. కడప ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు, వెనకబడిన జిల్లాల అభివృద్ధి ప్యాకేజీపై బడ్జెట్లో ప్రస్తావన లేకపోవడం విచారకరం. కేంద్ర బడ్జెట్లో వేతన జీవులపై విధించే పన్ను విధానంలో స్లాబుల రూపంలో ఊరట కల్పించినప్పటికీ పరోక్ష పన్నుల ద్వారా దోపిడీకి ద్వారాలు తెరిచింది. ఇది పేదరికాన్ని పెంచి పోషించే బడ్జెట్.

-చంద్ర,
సీపీఐ జిల్లా కార్యదర్శి

కడప ఉక్కుకు నిధులు కేటాయించకపోవడం దారుణం



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కడప ఉక్కుకు నిధులు కేటాయించకపోవడంతో కడప ఉక్కుపై కేంద్రానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం అవుతుంది. రాయలసీమ ప్రాంతానికి సంజీవని అయిన కడప ఉక్కు పై కేంద్రం వివక్ష చూపిస్తోంది. ఇటు రాష్ట్రంలోని అధికారపార్టీ ఎంపీలు కడప ఉక్కుకు అన్యాయం జరుగుతూ ఉంటే మాట్లాడకపోవడం దారుణం. ఇక్కడి ప్రాంత నిరుద్యోగ యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక వలస పోతున్నారు.

-వీరణాల శివకుమార్,
డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

బీమా రంగానికి నష్టం



ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రకటించిన బడ్జెట్ బీమా రంగానికి నష్టాన్ని కలిగిస్తుంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి పరిమితిని 74 నుంచి 100 శాతానికి పెంచడం బీమారంగానికి, పాలసీదారులకు మేలు చేయదు. 100 శాతం ఎఫ్‌డీఐ అంటే స్వదేశీ భాగస్వామి కంపెనీ లేకుండానే ఒక విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీ భారత దేశంలో నేరుగా ఏర్పాటు కావడం. ఇదే జరిగితే భారతదేశంలో 1956 కు ముందు పాలసీదారులను ముంచేసిన మోసాలు పునరావృతమవుతాయి. ఈ నిర్ణయం ఎల్ఐసీకి పరోక్షంగా దెబ్బతీస్తుంది.

-ఎ.రఘునాథరెడ్డి,
ప్రధాన కార్యదర్శి, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్, కడప డివిజన్

సామాన్య ప్రజలకు ఉపయోగపడని బడ్జెట్



కేంద్ర బడ్జెట్‌లో సామాన్య ప్రజలకు, రైతులకు, కూలీ వర్గాలకు, మధ్య తరగతి ప్రజలకు ఆశించిన ఊరట అందలేదు. దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే విధంగా, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ఈ బడ్జెట్ రూపుదిద్దుకోలేదు. కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, రైతులకు మద్దతు ధరలు పెంచేలా, ఉపాధి అవకాశాలు సృష్టించేలా, సామాజిక న్యాయాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలి.

-విజయ జ్యోతి, డీసీసీ అధ్యక్షురాలు



న్యూస్‌రీల్

ప్రశాంతంగా నైతిక, మానవ విలువల పరీక్ష

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ పరీక్షల్లో భాగంగా శనివారం ప్రథమ సంవత్సర విద్యార్థులకు నైతిక, మానవ విలువలు (ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్) పరీక్ష ప్రశాంతంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా 152 కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 17,261 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కడప నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను ఇంటర్ ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య తనిఖీ చేసి పరీక్ష తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ నుంచి ఒకేషన్ ప్రాక్టికల్స్ 14 కేంద్రాల్లో, 10వ తేదీ నుంచి జనరల్ ప్రాక్టికల్స్ 78 పరీక్షా కేంద్రాలలో ప్రారంభమవుతాయన్నారు. ప్రాక్టికల్స్, థియరీ పరీక్షలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో జరుగుతాయని ఆర్ఐవో వెంకటసుబ్బయ్య తెలిపారు.

ట్రిపుల్ ఐటీలకు నిధుల కొరత



మాట్లాడుతున్న ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్ విజయ్‌కుమార్, తదితరులు

వేంపల్లె: రాష్ట్రంలో రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయ పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీలకు నిధుల కొరత ఉందని ఆర్జీయూకేటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ విజయ్ కుమార్ తెలిపారు. శనివారం ఆయన ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీని సందర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని ట్రిపుల్ ఐటీలకు నూతన భవనాలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్, కంప్యూటర్లు, మౌలిక వసతులు, మెస్సులు తదితర వాటికి రూ.300 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యనందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం పీయూసీ, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి 660 రెగ్యులర్ పోస్టులను భర్తీ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందన్నారు. కొందరు కోర్టుకు వెళ్లడంతో పోస్టుల భర్తీ ఆగిపోయిందన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న అధ్యాపకులకు మినిమం టైం స్కేల్ విషయంపై తమ చేతుల్లో లేదని, ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. ట్రిపుల్ ఐటీలలో కొత్తగా ఏఐఎంఎల్ (ఆర్టిఫిషియల్ ఇంటిలిజెంట్ మిషన్ లర్నింగ్) కోర్సును ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నామని, ఈ కోర్సుకు సంబంధించి గవర్నింగ్ కౌన్సిల్ నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్ర కుమార్ సండ్ర, డైరెక్టర్లు ప్రొఫెసర్ కుమారస్వామి గుప్తా, ప్రొఫెసర్ బాలాజీ, ప్రొఫెసర్ భాస్కర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య ఆశలపై నీళ్లు

- రోడ్లు, ప్రాజెక్టులు తప్ప మరొకటి మాట్లాడని వైనం
- ప్రయోజనం చేకూర్చని బాబు పర్యటన

సాక్షి రాయచోటి: జిల్లాల పునర్విభజనలో భాగంగా పురుడు పోసుకున్న అన్నమయ్య జిల్లా ఆశలపై సీఎం చంద్రబాబు నీళ్లు కుమ్మరించారు. ముఖ్యమంత్రి హోదాలో జిల్లా ఏర్పడిన అనంతరం తొలిసారిగా వచ్చిన నేపథ్యంలో ప్రజల్లో భారీ అంచనాలు ఉన్నాయి. జిల్లాపై నిధుల వర్షం కురిపిస్తారని ప్రజలు ఆశించారు. అయితే జిల్లాలోని వివిధ ప్రాంతాల గురించి చర్చే లేకుండా సభ జరిగిపోయింది.

సీఎం నోట....రోడ్డు, ప్రాజెక్టుల మాట

అన్నమయ్య జిల్లాకు సంబంధించి ముఖ్యమంత్రి చంద్రబాబు నోట రోడ్ల గురించి ప్రస్తావించారు. సుమారు రూ. 6 కోట్లతో నియోజకవర్గంలో రోడ్లు వేశామని, దాదాపు 80 శాతానికి పైగా పూర్తయినట్లు చెప్పారు. అంతేకాకుండా బనకచర్ల నుంచి ఈ ప్రాంతానికి నీళ్లతీసుకు వచ్చి హంద్రీ-నీవా కెనాల్ ద్వారా తంబళ్లపల్లె నుంచి చిత్తూరువరకు తీసుకు వెళతామని వెల్లడించారు. మధ్యలో శ్రీనివాసపురం, ఝరికోన ప్రాజెక్టులు పూర్తిచేస్తామని బాబు నోట హామీ మాట వచ్చింది. అంతే తప్ప జిల్లా గురించి మాట్లాడలేదు. చివరకు హోం టు వర్క్ చేస్తున్న సంబేపల్లెలోని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో మాట్లాడిన సందర్భంలో.... పలువురు రాయచోటి ప్రాంతం బాగా వెనుకబడి ఉందని, ఇక్కడ ఏదైనా సాఫ్ట్‌వేర్ పరంగా అభివృద్ధి చేయాలని కోరగా, దీనికి సంబంధించి కూడా బాబు ఎలాంటి హామీ ఇవ్వలేదు.



సీఎం కాన్వాయ్‌లో ఇరుక్కు పోయిన తల్లీ బిడ్డ వాహనం

మదనపల్లె వైద్య కళాశాల, అన్నమయ్య ప్రాజెక్టు మాటే లేదు

మదపల్లెలోని వైద్య కళాశాలకు సీట్లు రద్దుచేయడం, ఉన్న పెద్దాస్పత్రిని ప్రైవేటుపరం చేస్తున్నారని ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థి నాయకుడు మాధవ్ సభలో ముఖ్యమంత్రి ప్రైవేటుపరం చేయబోనని ప్రకటన చేయాలని కోరారు. అయితే మదనపల్లెకు సంబంధించి కళాశాల, ఆస్పత్రి, ఇతర అభివృద్ధి గురించి సీఎం నుంచి ఎలాంటి హామీ రాలేదు. అంతేకాకుండా గతంలో రాజంపేట సమీపంలోని అన్నమయ్య ప్రాజెక్టు వరద ధాటికి కొట్టుకుపోయింది. దీనిపై చిన్నపాటి మాట కూడా మాట్లాడలేదు. ప్రాజెక్టుల గురించి ప్రస్తావన వచ్చినా అన్నమయ్యమాట లేకుండా పోయింది.

ప్రజలకు తప్పని ఇబ్బందులు

జిల్లాలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని సంబేపల్లె వద్ద కాసేపు ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు. ముఖ్యమంత్రి సమీపంలోని హెలిప్యాడ్ దిగి వస్తున్న సమయంలోనూ..సభ ముగిసిన అనంతరం జాతీయ రహదారికి ఇటు, అటువైపున వాహనాలు నిలిపి వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సీఎం కాన్వాయ్ వెళ్లిన అనంతరం ముందుకు కదిలారు.

వినతులు ఇచ్చేవారిలో నిరాశ

చంద్రబాబు వస్తున్నారని ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించిన కొందరి అర్జీలను సీఎం చంద్రబాబు తీసుకోకపోవడంతో నిరాశ, నిస్పృహలకు లోనయ్యారు. సభా వేదిక పైనుంచి నేరుగా కిందికి వచ్చి వినతులు తీసుకుంటుండగా జనాలు ఒకరినొకరు ఇచ్చేందుకు పోటీలు పడ్డారు. పలువురు బాధతో తిరుగుముఖం పట్టారు.

సీఎంను కలిసిన ఎస్పీ

కడప అర్బన్: ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నమయ్య జిల్లా పర్యటనలో భాగంగా కడప విమానాశ్రయానికి వచ్చారు. ఆయనకు ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

డీజీపీని కలిసిన ఎస్పీ

డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన హరీష్‌కుమార్ గుప్తాను శుక్రవారం రాత్రి మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్ కలిశారు. పూలమొక్కను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

5న వైఎస్సార్‌సీపీ ఫీజు పోరు

- భారీ ర్యాలీ, కలెక్టర్‌కు వినతిపత్రం
- పోస్టర్లు విడుదల చేసిన వైఎస్సార్‌సీపీ నేతలు
- రూ.3,900కోట్ల ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్



ఫీజుపోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు రవీంద్రనాథ్ రెడ్డి, సురేష్‌బాబు, అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు ఫిబ్రవరి 5వ తేదీ ఫీజు పోరు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా వెల్లడించారు. శనివారం ఇక్కడి పార్టీ కార్యాలయంలో ఆ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం రవీంద్రనాథ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ 5వ తేదీ ఉదయం 10 గంటలకు వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహిస్తామని, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లె, మహవీర్ సర్కిల్ మీదుగా ఈ ర్యాలీ కలెక్టరేట్‌కు చేరుతుందన్నారు. అక్కడ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. చంద్రబాబు 2019లో దిగిపోయేనాటికి రూ.2800కోట్లు ఫీజు రీయంబర్స్‌మెంట్, రూ.148కోట్లు మధ్యాహ్న భోజనం పథకం బకాయిలు పెట్టిపోయారన్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని బకాయిలు చెల్లించడమేగాక జగనన్న విద్యా కానుక, జగనన్న వసతి దీవెన, అమ్మ ఒడి పథకాలను ప్రవేశపెట్టి పేద విద్యార్థులను విద్యను చేరువ చేశారన్నారు. గతంలో ఒక నిర్ణీత మొత్తం మాత్రమే ఫీజు రీయంబర్స్‌మెంట్ ఉండేదని, వైఎస్ జగన్ సీఎం అయ్యాక పెద్ద కాలేజీల్లో ఎంత ఫీజు ఉన్నా అంతా ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు కావొస్తుందని, ఇప్పటికి మూడు త్రైమాసికాల బకాయిలు రూ.3900కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ ఫీజులు చెల్లించాలని కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ఫీజు పోరు కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ప్రభుత్వం మెడలు వంచి బకాయిలు విడుదల చేయిస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పి. గురుసాయిదత్త మాట్లాడారు.

లోకేష్‌ను ప్రమోట్ చేసుకునేందుకే దావోస్ పర్యటన: అంజద్‌బాషా

తన కుమారుడు లోకేష్‌ను ప్రమోట్ చేసుకునేందుకే సీఎం చంద్రబాబు కోట్లాది రూపాయలు వెచ్చించి దావోస్ పర్యటన నిర్వహించారని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా విమర్శించారు. దావోస్ పర్యటనలో తెలంగాణ రూ.1.75లక్షల కోట్లు, మహారాష్ట్ర రూ.4లక్షల కోట్లు పెట్టుబడులు సాధించగా, చంద్రబాబు, లోకేష్ ఒట్టి చేతులతో తిరిగొచ్చారని ఎద్దేవా చేశారు. వైఎస్ జగన్ తెచ్చిన పరిశ్రమలను తన ఖాతాలో వేసుకొని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. పవన్ కళ్యాణ్ ప్రజల పక్షాన ప్రశ్నించే సాహసం చేయడం లేదని విమర్శించారు. ఇది విద్యార్థులకు ఫీజులు కూడా చెల్లించలేని దద్దమ్మ ప్రభుత్వమని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, దాసరి శివప్రసాద్, సీహెచ్ వినోద్, అహ్మద్, షఫీ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జ్యోతి క్షేత్రంలో 7న సమావేశం


జ్యోతిక్షేత్రంలో మాట్లాడుతున్న అచలానంద ఆశ్రమం పీఠాధిపతి నీరజానందస్వామి

కాశినాయన : జ్యోతి క్షేత్ర పరిరక్షణ కోసం ఈనెల 7వ తేదీ ఉదయం 10 గంటలకు జ్యోతిక్షేత్రంలో సమావేశం ఏర్పాటు చేస్తున్నామని తోట్లపల్లె అచలానంద ఆశ్రమం పీఠాధిపతి నీరజానందస్వామి తెలిపారు. జ్యోతి క్షేత్రంలోని కొన్ని భవనాలకు అటవీశాఖ అనుమతులు లేవని ఇటీవల కాలంలో మూడు సార్లు కూల్చి వేశారని, దీన్ని అడ్డుకునేందుకు అందరం సమష్టిగా పనిచేయాలని అన్నారు. శనివారం జ్యోతిక్షేత్రాన్ని ఆయన సందర్శించి కూల్చిన కట్టడాలను పరిశీలించారు.

హాస్టల్ ఉద్యోగిపై చర్యలు తీసుకుంటాం


విద్యార్థి ఒంటి మీద ఉన్న గాయాలను పరిశీలిస్తున్న సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి

కాశినాయన : మండల కేంద్రమైన నరసాపురంలోని ఎస్సీ హాస్టల్‌లో శుక్రవారం రాత్రి అక్కడ పనిచేసే రవికుమార్ అనే హాస్టల్ ఉద్యోగి హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థిని బెల్టుతో వీపుపై చితకబాదాడు. విషయం తెలుసుకున్న సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి శనివారం హాస్టల్‌ను సందర్శించారు. హాస్టల్ విద్యార్థులతో మాట్లాడి వారి నుంచి వివరాలను సేకరించారు. ఈ విషయంపై అతనిపై చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి


పార్వతమ్మ(ఫైల్)

సింహాద్రిపురం: మండలంలోని బిదినంచర్ల గ్రామానికి చెందిన ఎల్లప్ప గారి పార్వతమ్మ (80) అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. వివరాలు ఇలా.. గత నాలుగు రోజుల నుంచి ఆమె నివాసం ఉన్న ఇంటికి తాళం వేసి ఉంది. శనివారం సాయంత్రం ఇంటి నుంచి దుర్వాసన వస్తూ ఉండడంతో పక్కింటి వారు ఆమె కుమారులకు సమాచారం ఇచ్చారు. వారు శనివారం రాత్రి అనంతపురం నుంచి బిదినంచెర్లకు చేరుకొని పోలీసుల సాయంతో ఇంటికి వేసిన తాళాన్ని పగులగొట్టారు. ఇంటి లోపల పార్వతమ్మ శవమై పడి ఉంది. ఇది హత్య అయి ఉండొచ్చని కుమారులు అనుమానం వ్యక్తం చేశారు. ఎస్‌ఐ తులసి నాగ ప్రసాద్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

భూమి ఫెన్సింగ్, డెకరేషన్ సామగ్రి ధ్వంసం

చింతకొమ్మదిన్నె : మండల పరిధిలోని రింగురోడ్డుకు ఆనుకొని ఉన్న మామిళ్లపల్లి గ్రామ పొలం సర్వే నంబర్ 555లో గల తమ భూమి ఫెన్సింగ్, భూమిలోని డెకరేషన్ సామగ్రిని శనివారం తెల్లవారుజామున ధ్వంసం చేశారని చింతకొమ్మదిన్నె మండలం అంగడివీధి నివాసి మంత్రి కిరణ్ కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పగడాల సుబ్బయ్య, ప్రదీప్ మరికొందరితో కలిసి ఈ చర్యకు పాల్పడ్డారని చింతకొమ్మదిన్నె పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై సీఐ శంకర్ నాయక్‌ను వివరణ కోరగా ఫిర్యాదుపై కేసు నమోదు చేసి కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు.

అధికార పార్టీలో మైనింగ్ చిచ్చు

- వేముల మండలంలో భగ్గుమన్న విభేదాలు
- మైనింగ్‌లో తనకు వాటా ఇవ్వాలని ఓ నేత హుకుం జారీ
- ససేమిరా అంటున్న మరో వర్గం నేత
- చేతులెత్తేసిన నియోజకవర్గ నాయకుడు
- తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమైన వైనం
- పోలీసుల రంగ ప్రవేశం


చింతలజూటూరు గ్రామంలో పికెట్ నిర్వహిస్తున్న పోలీసులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : ముగ్గురాయి మైనింగ్ కోసం టీడీపీ నాయకుల ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరుకుంది. ఒకవర్గంపై దాడులు చేసేందుకు కూడా సిద్ధమయ్యారు. ఇటీవలే వేముల మండలంలో బెరైటీస్ కంపెనీకి చెందిన దాదాపు రూ.15కోట్ల ముగ్గురాయిని రాత్రికి రాత్రే మండలానికి చెందిన ఓ నేత తరలించుకుని వెళ్లినట్లు బలమైన ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ప్రభుత్వం కానీ, పోలీసులు కానీ, మైనింగ్ అధికారులు కానీ ఆ నేతపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఆ నేత మైనింగ్ విషయంలో మరింత రెచ్చిపోతున్నాడు. తానే సర్వస్వం అంతా తనకే చెందాలనే విధంగా సొంత పార్టీ నేతలను కూడా బెదిరిస్తున్నాడు. తాజాగా శనివారం అలాంటి సంఘటన చోటు చేసుకుంది. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా..

వేముల మండలం చింతలజూటూరు గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకుడు మండలంలో ముగ్గురాయి మైనింగ్ నిర్వహిస్తున్నాడు. అతను చేస్తున్న మైనింగ్‌లో తనకు 50 శాతం వాటా ఇవ్వాల్సిందిగా అదే పార్టీకి చెందిన ఓ నేత తీవ్రంగా ఒత్తిడి చేశాడు. దీంతో చింతలజూటూరు గ్రామానికి చెందిన నాయకుడు తాను 50 శాతం వాటా ఇవ్వలేనని, 10 శాతం వాటా అయితే ఇవ్వగలనని తేల్చి చెప్పాడు. దీంతో కోపోద్రిక్తుడైన ఆ నాయకుడు తన అనుచరులను చింతలజూటూరు గ్రామానికి చెందిన నాయకుడు నిర్వహిస్తున్న మైనింగ్ వద్దకు వెళ్లి పనులను ఆపించినట్లు సమాచారం.

నియోజకవర్గ నాయకుడికి ఫిర్యాదు..

చింతలజూటూరు గ్రామానికి చెందిన నాయకుడు తన మైనింగ్ పనులను ఆపివేయడంపై సదరు నేతపై నియోజకవర్గ నాయకుడికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే నియోజకవర్గ నాయకుడు వారు తాను చెప్పినా వినరని, చేతులెత్తేసినట్లు సమాచారం. దీంతో చింతలజూటూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులంతా ఏకమై శనివారం సదరు నేతపై తాడోపేడో తేల్చుకునేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. చింతలజూటూరు గ్రామస్తులంతా ఏకమై తమ ఊరి నాయకుడు నిర్వహిస్తున్న మైనింగ్ వద్దకు వెళ్లి పనులు మొదలు పెట్టాలని, ఎవరైనా వస్తే తేల్చుకోవాలని సిద్ధపడినట్లు సమాచారం.

పోలీసుల రంగ ప్రవేశం..

ఈ విషయాన్ని గ్రహించిన పోలీసులు శనివారం పెద్ద ఎత్తున చింతలజూటూరు గ్రామానికి చేరుకున్నారు. అయితే చింతలజూటూరు గ్రామస్తులు కూడా పోలీసులతో తీవ్ర వాదోపవాదాలు చేసినట్లు తెలిసింది. తాము సక్రమంగా మైనింగ్ నిర్వహిస్తుంటే అతనికి వాటా ఎందుకు ఇవ్వాలని పోలీసులను గట్టిగా ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో పోలీసులు తమకు రెండు రోజులు సమయం ఇవ్వాలని, ఆ నేతతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని గ్రామస్తులను శాంతపరిచినట్లు తెలిసింది. చింతలజూటూరు గ్రామంలో పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేసి పికెట్ నిర్వహిస్తున్నారు.

ఫీజు చెల్లించాలని ఫార్మసీ కళాశాల వేధింపులు

ప్రొద్దుటూరు : మండలంలోని పెద్దశెట్టిపల్లెలో ఉన్న శ్రీలక్ష్మీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాల యాజమాన్యం తనను ఫీజు చెల్లించలేదని వేధిస్తోందని బి.ఫార్మసీ రెండో సంవత్సరం విద్యార్థిని యు.ప్రసన్న శనివారం ప్రొద్దుటూరు కోర్టు మండల లీగల్ సర్వీస్ అథారిటీకి ఫిర్యాదు చేసింది. కళాశాలలో చేర్చుకునేటప్పుడు ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే చెల్లిస్తుందని కళాశాల యాజమాన్యం చెప్పిందని విద్యార్థిని పేర్కొన్నారు. మొదటి సంవత్సరం ఫీజు చెల్లిస్తేనే పరీక్ష రాసేందుకు హాల్ టికెట్ ఇస్తామని వేధించారన్నారు. తమ తల్లిదండ్రులు అంత ఫీజు కట్టలేరని చెప్పినా వారు వినలేదని తెలిపారు. తోటి విద్యార్థుల ముందు కించపరిస్తూ దురుసుగా మాట్లాడుతూ తనను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది ఫీజు రీయింబర్స్‌మెంట్ రాలేదని కళాశాల యాజమాన్యం చెబుతోందని తెలిపారు. సోమవారం జరగనున్న పరీక్షలకు ఫీజు చెల్లిస్తేనే హాల్ టికెట్ ఇస్తామని వేధిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికిప్పుడు ఇంత ఫీజు చెల్లించే స్తోమత తమ తల్లిదండ్రులకు లేదన్నారు. కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుని తనకు హాల్ టికెట్ ఇచ్చి పరీక్షలకు హాజరయ్యే విధంగా చేయాలని కోరుతోంది.

ఆటోను ఢీకొన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు

ఒకరి మృతి, ఆరుగురికి గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

వేంపల్లె : వీరపునాయునిపల్లి మండలం నేలతిమ్మయ్యగారిపల్లె గ్రామ సమీపంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఆటోను ఢీకొంది. ముకుంద ట్రావెల్స్‌కు చెందిన బస్సు హైదరాబాదు నుంచి వేంపల్లెకు వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. వేంపల్లె పట్టణ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీకి చెందిన కూలీలు ఆటోలో ఎర్రగుంట్లకు వెళుతుండగా నేలతిమ్మయ్యగారిపల్లె గ్రామ సమీపంలోకి రాగానే హైదరాబాద్ నుంచి వస్తున్న ముకుంద ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆంజనేయులు, శ్రీనివాసులు, అంజనమ్మ, లక్ష్మయ్య, వీరయ్య, రమణమ్మ, చిన్న రాయుడులకు గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనం ద్వారా వేంపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వీరయ్య (57)మృతి చెందాడు. ఆంజనేయులు పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు కడప రిమ్స్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని వీరపునాయునిపల్లె పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.


మృతి చెందిన వీరయ్య



చికిత్స పొందుతున్న లక్షుమయ్య, అంజనమ్మ

వైఎస్ అభిషేక్ రెడ్డి కుటుంబానికి వైవీ సుబ్బారెడ్డి పరామర్శ


వైఎస్ మధురెడ్డి, వైఎస్ అభినవ్‌రెడ్డిలను పరామర్శిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

పులివెందుల రూరల్ : వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వైఎస్ అభిషేక్‌రెడ్డి గతనెల 10వ తేదీన అనారోగ్యంతో మృతి చెందారు. అప్పట్లో కొన్ని అనివార్య కారణాలవల్ల రాలేకపోయిన టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి శనివారం పట్టణంలోని అంబకపల్లె రోడ్డులో ఉన్న వైఎస్ ప్రకాష్‌రెడ్డి ఇంటికి వెళ్లి వైఎస్ ప్రకాష్‌రెడ్డిని పరామర్శించారు. అలాగే వైఎస్ అభిషేక్‌రెడ్డి తండ్రి వైఎస్ మధురెడ్డి, సోదరుడు వైఎస్ అభినవ్‌రెడ్డిలను పరామర్శించి వారికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైఎస్ అభిషేక్‌రెడ్డి వైద్యుడు, ఉత్సాహవంతుడు అని, రాజకీయాల్లో చురుగ్గా పాల్గొంటూ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రతాప్ రెడ్డి, హాలు గంగాధరరెడ్డి, రసూల్, భాస్కర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, మహేశ్వరరెడ్డి, సురేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బసిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన బూచుపల్లె గంగాధరరెడ్డి కుమారుడు నవీన్‌కుమార్‌రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి సోదరుడు రత్నారెడ్డి, జ్యోతిల కుమార్తె సహజరెడ్డి వివాహం పట్టణంలోని కదిరి రోడ్డులో ఉన్న విజయ్ గార్డెన్‌లో జరిగింది. ఈ వివాహ వేడుకకు వైవీ సుబ్బారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే ఈ వివాహ వేడుకలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నేత్రవైద్య సేవలు అభినందనీయం


జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవిని సత్కరిస్తున్న అతిథులు

కడపకోటిరెడ్డి సర్కిల్: ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ప్రజలకు అందిస్తున్న నేత్ర వైద్య సేవలు అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ శ్రీదేవి కొనియాడారు. శనివారం కడప నగరంలోని ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌లో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రాంగణంలో ప్రథమ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఎల్‌వీపీఈఐ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ప్రశాంత్ గార్గ్ , డాక్టర్ రమేష్, డాక్టర్ అవినాష్ పట్నంగి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ రాజశేఖర్ రెడ్డి క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కావ్య మాధురి టీం కార్యక్రమాలను పర్యవేక్షించింది.

చెలరేగిన ఆంధ్రా బ్యాట్స్‌మన్

రెండో మ్యాచ్‌లో భారీస్కోరు దిశగా ఆంధ్రా జట్టు


సెంచరీ చేసిన హేమంత్‌రెడ్డి, 136 పరుగులు


వెంకటరాహుల్, 162 పరుగులు


తలపడుతున్న ఆంధ్రా-హిమాచల్‌ప్రదేశ్ జట్లు

కడప ఎడ్యుకేషన్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో కల్నల్ సీకే నాయుడు అండర్–23 అంతర్ రాష్ట్రాల క్రికెట్ మ్యాచ్‌లో ఆంధ్రా జట్టు బ్యాట్స్‌మన్ చెలరేగారు. శనివారం నిర్వహించిన మ్యాచ్‌లో హిమాచల్‌ప్రదేశ్, ఆంధ్రా జట్లు తలపడగా ఆంధ్రా జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలిరోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి ఆంధ్రా జట్టు 360 పరుగులు చేసింది. జట్టులోని హేమంత్‌రెడ్డి 136 పరుగులు, వెంకటరాహుల్ 162 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. హిమాచల్‌ప్రదేశ్ బౌలర్లు సాహిల్ శర్మ 2, నారాయణ 2 వికెట్లు తీశారు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

అబద్ధపు హామీలు ఇవ్వడం చంద్రబాబు నైజం

టీటీడీ మాజీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి


మీడియాతో మాట్లాడుతున్న రాజ్యసభ్య సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

పులివెందుల రూరల్ : అబద్ధపు హామీలు ఇవ్వడం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నైజమని టీటీడీ మాజీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి విమర్శించారు. శనివారం ఆయన ఓ వివాహ వేడుకకు హాజరయ్యారు. అనంతరం పులివెందుల నియోజకవర్గం అంబకపల్లె రోడ్డులో ఉన్న వైఎస్ మధురెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎలాగైనా అధికారం దక్కించుకోవాలని లక్ష్యంగా ఎన్నికల వేళ సీఎం చంద్రబాబు లెక్కలేని హామీలు ఇచ్చారన్నారు. ఆశతో నమ్మి ఓట్లు వేసిన రాష్ట్ర ప్రజలను పూర్తిగా మోసం చేశారన్నారు. రాష్ట్ర పరిస్థితి సరిగా లేకపోయినప్పటికీ అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి 8 నెలలు పూర్తవుతున్నా ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చిన పాపాన పోలేదన్నారు. కరెంటు చార్జీలు పెంచారని, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించకుండా విద్యార్థుల చదువులతో చెలగాటమాడుతున్నారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల రాష్ట్ర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వాన్ని ఎందుకు అధికారంలోకి తెచ్చామా అని రాష్ట్ర ప్రజానీకం బాధపడుతున్న పరిస్థితి నెలకొందన్నారు. 2027లో వచ్చే జమిలీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రజలందరూ కూడా వైఎస్సార్‌సీపీని గెలిపించుకునేందుకు, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.

బాలల కోసం బంగారు లోకం




బాలోత్సవాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ, ప్రదర్శన కోసం తీసుకున్న వస్తున్న ఎగ్జిబిట్లు, వేషధారణలో విద్యార్థి

- వేలాదిమందితో బాలోత్సవం
- 20కి పైగా పలు రకాల పోటీలు
- ప్రాంగణమంతా బాలల సందడే సందడి

కడప కల్చరల్ : ఆ ప్రాంగణమంతా ఉదయం నుంచి సాయంత్రం వరకు బాలల కోసం ఏర్పడిన బంగారు లోకాన్ని తలపించింది. బడి అన్న బిడియం, పాఠాలన్న భయం, అయ్యవార్లు దండిస్తారేమోనన్న అనుమానాలు లేనే లేవు. రెక్కలు వచ్చిన కొత్త పక్షుల్లా సాయంత్రం వరకు ఆడిపాడి ఆనందించారు. కడప బాలోత్సవ్ కమిటీ ఆధ్వర్యంలో రెండవ ఉత్సవం తొలిరోజు కార్యక్రమాన్ని శనివారం స్థానిక సెయింట్ జోసెఫ్ హైస్కూలులో నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ జాతీయ పతాకావిష్కరణ చేసి కార్యక్రమాన్ని, కమిటీ బాధ్యులు రాజా వెంగళరెడ్డి ఇతర కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి మాట్లాడుతూ ఒక ఉత్సవంలో ఇంతమంది విద్యార్థులు పాల్గొనడం ఇదే మొదటిసారన్నారు. ఇది తమతోపాటు నిర్వాహకులకు ఎంతో సంతోషాన్ని, ఉత్సాహ ప్రోత్సాహాలను కలిగిస్తోందన్నారు. ప్రోత్సహించిన ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. మానసిక వికాసం, శాస్త్రీయ దృక్పథం పెరిగేందుకు, మానవత్వాన్ని పెంచేందుకు ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. నిర్వాహకులను అభినందించారు. మండల విద్యాశాఖ అధికారి గంగిరెడ్డి, బాలోత్సవం గౌరవ సలహాదారులు వీర సుదర్శన్ రెడ్డి, గౌరవాధ్యక్షులు నాగముని రెడ్డి, అధ్యక్షులు గుర్రాల గోపాల్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ మృత్యుంజయరావు , డాక్టర్ ఓబుల్ రెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, ఉషా తులసి, సుందరయ్య, డాక్టర్ జగదీశ్వర్ రెడ్డి , రఘునాథరెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణలు ఆశ్చర్యకరం

కార్యక్రమాలకు జిల్లా నలుమూలల నుంచి తమదైన శైలిలో బుర్రలకు పదునుపెట్టి పెద్దలు ఆశ్చర్యపోయేలా వస్తువులను తయారు చేసుకుని వచ్చారు. తొలిరోజు 12 అంశాలలో సీనియర్లు, జూనియర్, సబ్ జూనియర్ విభాగాలుగా పోటీలు నిర్వహించారు. జానపద, శాస్త్రీయ నృత్యాలు, దేశభక్తి గీతాల ఆలాపన, రెయిమ్స్, విచిత్ర వేషధారణ తదితర అంశాలలో దాదాపు వెయ్యి మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రాంగణంలో మొత్తం నాలుగు విభాగాలుగా వేదికలను ఏర్పాటు చేశారు. ప్రతి విభాగానికి సరిపడ నిర్వాహకులు, కో ఆర్డినేటర్లు, న్యాయ నిర్ణేతలు తదితరులు కార్యక్రమాన్ని సజావుగా నడిపించేందుకు తమవంతు సహకారం అందజేశారు.

ఆకర్షణీయం

ఈ ఉత్సవంలో ప్రధానంగా మట్టితో బొమ్మలు చేసే నైపుణ్యం అందరినీ ఆకట్టుకుంది. దినపత్రిక పఠనం, కథలు చెప్పడం, బెస్ట్ ఫ్రం వేస్ట్, కార్టూన్లు, మెమొరీ టెస్టు తదితర అంశాలను పెద్దలను సైతం ఆశ్చర్యపరిచాయి. నృత్య వేదికపై చిన్నారులు చేసిన శివతాండవం, పుష్ప–2 జాతర సందర్శకులను ఉర్రూతలూగించాయి.